క్లుప్తంగా

ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం సద్వినియోగం చేసుకోండి



ప్రారంభిస్తున్న రామ్మోహన్‌రావు

జన్నారం: మహిళలకు ఉపాధి కల్పించడంలో భాగంగా ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా లేబర్ అధికారి రామ్మోహన్‌రావు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. భవననిర్మాణ కార్మికుల కుటుంబాలకు చెందిన 25మంది మహిళలకు ఉచితంగా 90రోజులు శిక్షణ ఇచ్చి, కుట్టు మిషన్లు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. భవన నిర్మాణ కార్మికులు ఈ శ్రమ్ కార్డును తీసుకోవాలని సూచించారు. మండలంలోని మహ్మదబాద్‌లో మరో కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా లేబర్ అధికారిని భవననిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు ముల్కల్ల ప్రభాకర్ సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభుదాస్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు తిరుపతి, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్కేటింగ్ పోటీలకు సాకేత్‌రామ్ ఎంపిక



మంచిర్యాలఅర్బన్: స్థానిక నారాయణ పాఠశాలకు చెందిన బుద్దె సాకేత్‌రామ్ (8వ తరగతి) జాతీయ రోలర్ స్కేటింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 12న కరీంనగర్ అంబేడ్కర్ క్రీడా మైదానంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించారు. ఏప్రిల్ 25నుంచి 29 వరకు చండీఘర్ రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు తెలంగాణ రాష్ట్రం నుంచి పాల్గొంటారని పాఠశాల ప్రిన్సిపాల్ కవిత తెలిపారు. అకాడమిక్ డీన్ అంజనేయులు, ఏవో సంతోష్, పీఈటీ పవన్ తదితరులు అభినందించారు.

స్వచ్ఛభారత్ మిషన్‌పై శిక్షణ

దండేపల్లి: మండలంలోని ధర్మరావ్‌పేటలో స్వచ్ఛభారత్ మిషన్ పై సోమవారం రెండో విడత శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వచ్ఛభారత్ మిషన్ ప్రోగాం జిల్లా కో ఆర్డినేటర్ రాజేందర్, ఎంపీడీవో మల్లేశం మాట్లాడుతూ.. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు తెలియజెప్పాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ప్రతీ ఇంటా మరుగుదొడ్డి నిర్మాణం తప్పనిసరి, ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలన్నారు. అనంతరం గ్రామంలో ఇంటింటా సర్వే నిర్వహించారు. గ్రామంలో సామాజిక చిత్రపటాన్ని గీశారు. కార్యక్రమంలో ఏపీవో దుర్గప్రసాద్, మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీఎస్‌వో ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



మంచిర్యాలఅర్బన్: ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్ (ఐఎన్‌టీఎస్‌వో) పరీక్షా ఫలితాల్లో స్థానిక శ్రీ చైతన్య విద్యార్థులు ప్రతిభ చూపారు. ఫిబ్రవరి 12న నిర్వహించినన ఒలింపియాడ్ పరీక్షలకు 800మంది హాజరుకాగా 308మంది విద్యార్థులు ఫైనల్ లెవల్ గ్రాండ్ ప్రైజ్‌లతో పాటు వివిధ బహుమతులు సాధించారు. గ్రాండ్ ప్రైజ్ సాధించిన వారిలో శ్రీతమ్ రెడ్డి ల్యాప్‌టాప్, గోల్డ్‌మెడల్ సాధించారు. విష్ణుప్రియ (ఫస్ట్ ర్యాంకు)ట్యాబ్, గోల్డ్‌మెడల్, అభిరూప్(థర్డ్), సాయికాక్షిత్ (5వ) ర్యాంకు సాధించి గోల్డ్‌మెడల్, మెరిట్ సర్టిఫికెట్లు సాధించారని ప్రిన్సిపాల్ జోబిస్ తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ఆర్ఐ రాజు, కో–ఆర్డినేటర్ శివ కోటేశ్వరావు, డీన్ గజానంద్, ఏవో విలాస్, ఇన్‌చార్జీలు రాజేందర్ అభినందించారు.

సన్మానం



పాతమంచిర్యాల: జిల్లాకు చెందిన ఈసంపల్లి శివ, దామెర్ల ప్రీతి సివిల్ జడ్జీలుగా ఎంపిక కాగా తెలంగాణ బీసీ జాగృతి నాయకులు సోమవారం జిల్లా కేంద్రంలో వారికి సన్మానం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ బీసీ జాగృతి జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్, జాగృతి పట్టణ అధ్యక్షుడు భాస్కర్, యువ జాగృతి నాయకులు సదానందం, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల్లో అధిక పోషకాలు

- కొనసాగుతున్న పోషణ్ పక్వాడా
- అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో పౌష్టికాహారంపై అవగాహన
- పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు



దండేపల్లి: ప్రతిజ్ఞ చేస్తున్న టీచర్లు, బాలింతలు

బెల్లంపల్లి: చిరు ధాన్యాలలో పోషకాలు అధికంగా ఉంటాయని జిల్లా సంక్షేమ అధికారి చిన్నయ్య, బెల్లంపల్లి సీడీపీవో ఉమాదేవి అన్నారు. స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో సోమవారం పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. కిశోర బాలికలకు రక్త పరీక్షలు నిర్వహించి, పండ్లు పంపిణీ చేశారు. రోజువారీగా చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం వల్ల శరీరానికి పోషకాలు మెండుగా అంది ఆరోగ్యంగా ఉండటానికి వీలు కలుగుతుందన్నారు. పాలు, పండ్లు తీసుకుని ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవాలని, జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ హేమసత్య, మంచిర్యాల సీడీపీవో స్వరూప, సెక్టోరియల్ అధికారి పద్మజ, కస్తూర్బాగాంధీ విద్యాలయం ప్రిన్సిపాల్ వాణి, కస్తూర్బాగాంధీ విద్యాలయం, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని రాంనగర్ సెక్టార్ పరిధిలోని ఎన్టీఆర్‌నగర్, గర్మిళ్ల అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో గర్మిళ్ల ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు చిరుధాన్యాలు, రక్తహీనతపై అవగాహన కల్పించారు. విద్యార్థినులకు రక్తపరీక్షలు చేసి, రక్తహీనతను గుర్తించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సులోచనదేవి, గర్మిళ్ల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణ, అంగన్‌వాడీ టీచర్లు రేణుక, సురేఖ, శారద, మంగ, భూదేవి, రాజేశ్వరి, పద్మావతి, ఏఎన్‌ఎం పద్మ, ఆర్పీ హారికలు పాల్గొన్నారు. రాజీవ్‌నగర్‌లోని కస్తూరిభా విద్యాలయంలో విద్యార్థినులకు రక్తపరీక్షలు చేయడంతో పాటు, తృణధాన్యాలతో అందే పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ సత్తమ్మ, డాక్టర్ శ్వేత, ప్రిన్సిపాల్ స్వప్న, హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామ్మూర్తి, నాందేవ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు టి.ఇందిరా, కె.చందన, టి.రమాదేవి, ఆర్‌బిఎస్‌కే టీం కె.వనిత, ఎస్.భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ సురేఖ పాల్గొన్నారు.

చిరుధాన్యాలలో సమృద్ధిగా పోషక విలువలు

చెన్నూర్: చిరు ధాన్యాలలో పోషక విలువలు సంవృద్ధిగా ఉంటాయని, కిశోర బాలికలు తప్పనిసరిగా చిరు ధాన్యాలు తీసుకోవాలని సీడీపీవో మనోరమ అన్నారు. స్థానిక దుబ్బాగూడెం, లైన్‌గడ్డ అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోర బాలికలకు చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రజియా సుల్తానా, రాజేశ్వరి, పోషణ్ అభియాన్ కోర్డినేటర్ నగేశ్ పాల్గొన్నారు.

భీమారం: స్థానిక కస్తూరిగాంధీ బాలికల విద్యాలయంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిత రక్తహీనతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల స్పెషల్ ఆఫీసర్ కనకలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: స్థానిక ఐకేపీ కార్యాలయంలో పోషకాహారంపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దీపవాహిని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం లక్ష్మి, మహిళలు పాల్గొన్నారు.

జన్నారం: స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో బాలికల రక్త నమునాలు సేకరించారు. రక్తహీనతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పొనకల్ సర్పంచ్ భూమేశ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, కేజీబీవీ స్పెషల్ అధికారి శ్రీవాణి, వైద్య సిబ్బంది సుభక్త, కల్పన, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

దండేపల్లి: స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సీడీపీవో రేష్మా చిరుధాన్యాల ప్రాముఖ్యం, వాటి వాడకం గురించి బాలింతలకు తెలియజేశారు. దండేపల్లి ఉన్నత పాఠశాలలో ఎనిమియా గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. హిమోగ్లోబిన్ పరీక్షలు చేశారు. సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, ఉన్నత పాఠశాల హెచ్ఎం వరలక్ష్మి, ఏఎన్‌ఎం విజయ, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

చెన్నూర్‌రూరల్: మండలంలోని దుగ్నెపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ అంగ్రాజ్‌పల్లి సెక్టార్ సూపర్‌వైజర్ రజిత చిరుధాన్యాల వాడకం, లాభాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మంజుల, ఉపాధ్యాయులు బానయ్య, రత్న ప్రకాష్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు పద్మ, హేమలత, శ్యామల, ఆశ కార్యకర్త నీరజ పాల్గొన్నారు.

కోటపల్లి: మండలకేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరోజన ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. రక్తహీనతో బాధపడేవారు ఐరన్ పుష్కలంగా ఉండే చిరుధాన్యాలు తీసుకోవాలని సూచించారు.

జైపూర్: స్థానిక కస్తూర్బాగాంధీ విద్యాలయంలో, ఇందారం-2 అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత, కేజీబీవీ స్పెషల్ అధికారి ఫణిబాల, విజయ్‌శర్మ, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.



బెల్లంపల్లి: మాట్లాడుతున్న సీడీపీఓ ఉమాదేవి



కేజీబీవీలో అవగాహన కల్పిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్



చెన్నూర్: అవగాహన కల్పిస్తున్న సీడీపీవో



భీమారం: మాట్లాడుతున్న సూపర్‌వైజర్ రజిత

సంక్షిప్త వార్తలు

వారసంత, మేకల మండి వేలం

చెన్నూర్: పట్టణ పరిధిలో నిర్వహించే వారసంత, మేకల మండి 2023–2024ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వేలాన్ని సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించినట్లు మున్సిపల్ కమిషనర్ రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. మేకల మార్కెట్‌కు సార్ల సమ్మయ్య రూ.4,41,000, తై బజార్‌ను చిన్న కుమారస్వామి రూ.2,51,000కు వేలం ద్వారా దక్కించుకున్నట్లు కమిషనర్ తెలిపారు.

పరీక్ష కేంద్రం తనిఖీ

చెన్నూర్: విద్యార్థులు పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే డిబార్ చేస్తామని తహసీల్దార్ శ్రీనివాస్‌దేశ్‌పాండే అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని సోమవారం తహసీల్దార్ తనిఖీ చేశారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాస్తున్నారని పేర్కొన్నారు.

ఉచిత కంటి ఆపరేషన్లు

లక్సెట్టిపేట: మండలంలోని పలు గ్రామాలకు ప్రజలకు సోమవారం కంటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం 27మందికి ఉచిత కంటి ఆపరేషన్ చేయించేందుకు లయన్స్ క్లబ్ బెల్లంపల్లి విజన్ కేర్ ఆధ్వర్యంలో డైరెక్టర్ ఎల్ఎస్ ఇలియాజ్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని రేకుర్తికి తరలించినట్లు లయన్స్ విజన్ సెంటర్ సభ్యులు తెలిపారు.

క్షయపై అవగాహన

కోటపల్లి: క్షయ వ్యాధి నియంత్రణపై ప్రజల్లో అవగాహన కల్పించాలని డాక్టర్ సత్యనారాయణ సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో సోమవారం క్షయ నివారణ కోసం కృషి చేస్తున్న అలుగామ ఏఎన్‌ఎం విజయ, ఎడగట్ట అన్నారం ఆశ కార్యకర్తలు విజయలక్ష్మి, విజయను సన్మానించి ప్రశంసా పత్రాలు అందజేశారు. క్షయ నివారణకు నిర్ధారణ టెస్టులు, మందులు సక్రమంగా వాడేలా అవగాహన కల్పించి, వ్యాధి తీవ్రత తగ్గేలా చేయడంలో కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జ్యోతి, స్టాఫ్‌నర్సు గౌతమి సూపర్‌వైజర్ అశోక్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు విరాళం

పాతమంచిర్యాల: జిల్లాలోని చెన్నూర్ నియోజకవర్గం కోటపల్లి మండలం లింగన్నపేట గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్టాపన కోసం నేతకాని మహర్ హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేష్, తన తండ్రి దుర్గం పోషం చారిట్రబుల్ ట్రస్టు తరఫున రూ.5000 విరాళాన్ని విగ్రహ ప్రతిష్టాపన కమిటీ సభ్యులకు పాతమంచిర్యాలలోని తన నివాసంలో అందజేశారు.

ప్రజావాణికి స్పందన అంతంతే!

దండేపల్లి: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం మండల స్థాయిలో నిర్వహించే ప్రజావాణికి స్పందన అంతంతే ఉంటుంది. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఒకే ఒక్క దరఖాస్తు వచ్చింది. దండేపల్లి పశువైద్యశాల భవనం గురించి నటరత్న యూత్ అధ్యక్షుడు బొమ్మెన మహేష్, తహసీల్దార్ హన్మంతరావుకు వినతిపత్రం అందించారు. పశువైద్యశాల పాతభవనం శిథిలావస్థకు చేరిందని, నూతన భవన నిర్మాణం పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయని, వెంటనే పూర్తిచేయాలని కోరాడు. కార్యక్రమంలో యూత్ సభ్యులు నర్సయ్య, రాజమౌళి ఉన్నారు.



దండేపల్లిలో వినతిపత్రం ఇస్తున్న మహేశ్

కాసిపేట: నిరుపేదలకు రాష్ట్రప్రభుత్వం రేషన్ బియ్యం పంపిణీ చేయాలని సోమవారం ప్రజాపిర్యాదుల విభాగంలో తహసీల్దార్ దిలీప్‌కుమార్, ఎంపీడీవో ఎంఏ అలీంలకు బీజేపీ నాయకులు మెమోరాండం సమర్పించారు. కరోనా నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్న బియ్యం మాత్రమే పంపిణీ చేస్తున్నారని, రాష్ట్రప్రభుత్వం పంపిణీ చేయకపోవడంతో కేవలం 5కిలోలు మాత్రమే పేదలకు అందుతున్నాయన్నారు. బియ్యం వెంటనే పంపిణీ చేయాలని, వేసవికాలం సమీపిస్తున్నందునా బోర్‌వెల్‌లు మరమ్మతు చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధానకార్యదర్శి సూరం సంపత్‌కుమార్, మండల ఉపాధ్యక్షుడు బాకి నరేష్, నాయకులు శంకర్, యూసఫ్, రమేష్ తదితరులున్నారు.

భీమారం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి ప్రజల నుంచి స్పందన కరువైంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అధికారులు ప్రజావాణిలో ఉన్నప్పటికీ ప్రజలు దరఖాస్తులు ఇచ్చేందుకు రాలేదు. ఇందులో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ప్రజావాణికి వచ్చి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని ఎంపీడీవో శ్రీనివాస్ ప్రజలను కోరారు.

‘మేమింతే ప్రజావాణికి రామంతే’

నెన్నెల: మండల కేంద్రంలో నిర్వహించే ప్రజావాణికి అధికారులు అంతంత మాత్రమే హాజరవుతున్నారు. గత సోమవారం ప్రత్యేక అధికారి డెప్యూటీ కలెక్టర్ శ్రీరాములు ప్రజావాణికి గైర్హాజరైన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినా, మండల స్థాయి అధికారుల్లో మార్పు రాలేదు. 24శాఖల అధికారులు హాజరుకావాల్సి ఉండగా సోమవారం నెన్నెల ప్రజావాణికి 9మంది అధికారులు మాత్రమే హాజరయ్యారు. గ్రీవెన్స్‌కు హాజరుకాని అధికారులపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని ప్రత్యేక అధికారి చెప్పినప్పటికీ ఆయన మాటలు బేఖాతరు చేస్తున్నారు. ఫిర్యాదుదారులు సోమవారం ప్రజావాణికి ఒక్కరూ కూడా రాలేదు. ఇకనైనా ప్రజావాణికి రాని అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటే తప్పా, అధికారుల్లో మార్పు రాదని మండల ప్రజలు కోరుతున్నారు.

బతికుండగానే చంపేశారు!

- వితంతు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుంటే షాకింగ్ విషయం చెప్పిన అధికారులు
- సారూ నేను బతికే ఉన్నా అంటూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న దళిత మహిళ
- పింఛన్ మంజూరు చేయాలని వేడుకోలు



దరఖాస్తు ఇస్తున్న బాధితురాలి బంధువు



ఆసరా సైట్‌లో వెంకటమ్మ చనిపోయినట్లు..

కోటపల్లి: ‘సార్ నా పేరు బెల్లంపల్లి వెంకటమ్మ. మాది కోటపల్లి మండలం కొల్లూర్ గ్రామం. భర్త బెల్లంపల్లి బాలయ్య రెండేళ్ల కిందట చనిపోతే వితంతు పింఛన్ కోసం దరఖాస్తు పెట్టినా. దరఖాస్తు పెట్టి ఏళ్లు గడుస్తున్నా, నాకు వితంతు పింఛన్ మంజూరు అయితలేదు. నాకు ఎలాగైనా పింఛన్ మంజూరు చేయండి సారూ’ అంటూ కోటపల్లి ఎంపీడీవో ఆఫీసుకు వెళితే, నేను చచ్చిపోయినా నాకు పింఛన్ రాదు.. అని అంటుండ్రు. కష్టంతో కాలం ఎళ్లదీస్తున్న నన్ను, అధికారులు బతికుండగానే సంపేసిన్రు. నాకు ఆసరా పింఛన్ మంజూరు దేవుడెరుగు. నేను బతికి ఉన్నానని అధికారులకు ఎట్లా చెప్పాలే! ఇప్పటికైనా పెద్ద సార్లు స్పందించి నేను బతికి ఉన్నట్లు బయటి ప్రపంచానికి చెప్పండి అని ఓ నిరుపేద దళిత మహిళ ఆర్తనాధం ఇది.. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆన్‌లైన్‌లో సదరు మహిళను చనిపోయినట్లు నమోదు చేయడంతో ఆమె బాధ వర్ణానాతీతంగా మారింది. రెండు సంవత్సరాల క్రితం ఆమె భర్త మరణించగా పింఛన్ మంజూరు కోసం దరఖాస్తు చేసుకుంది. ఆసరా సైట్‌లో పింఛన్ వివరాలు నమోదు చేసే సమయంలో ఆ మహిళ చనిపోయినట్లు అధికారులు తప్పుడు సమాచారం నమోదు చేశారు. దీంతో ఆమెకు పింఛన్ మంజూరు కావడంలేదు. తనకు పింఛన్ ఎందుకు మంజూరు కాలేదని ఆరా తీసేందుకు కోటపల్లి ఎంపీడీవో కార్యాలయంలో అధికారులను అడగ్గా, నువ్వు చనిపోయావని అధికారులు చెప్పినట్లు ఆ తల్లి వాపోతుంది. తనకు ఆసరాగా ఉంటుందని వితంతు పింఛన్ మంజూరు చేయమంటే, తాను చనిపోయినట్లు అధికారులు ఆన్‌లైన్ నమోదు చేయడం ఏంటని ఆ మహిళా ప్రశ్నిస్తుంది. అధికారుల తప్పిదం వల్ల తాను ప్రభుత్వ సంక్షేమ పథకానికి దూరంగా ఉండాల్సి వస్తోందని, తాను బతికి ఉన్నానని ఎలా నిరూపించుకోవాలని వాపోతుంది. కాగా వెంకటమ్మకు పింఛన్ మంజూరు విషయంలో అధికారులు చేసిన తప్పిదంపై ఆమె బంధువులు సోమవారం కోటపల్లి మండలకేంద్రంలో జరిగిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.

ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలయ్యేలా చూడాలి

- డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు

చెన్నూర్‌రూరల్: ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు అయ్యే విధంగా చూడాలని డీఎంహెచ్‌వో డాక్టర్ సుబ్బారాయుడు సూచించారు. మండలంలోని అంగ్రాజ్‌పల్లి గ్రామంలోని పీహెచ్‌సీలో సోమవారం ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు, ఆశలకు రివ్యూ సమావేశం నిర్వహించారు. ప్రతి బుధ, శనివారాల్లో చిన్నారులకు, గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలు వేయాలని పేర్కొన్నారు. వేసవిలో వడదెబ్బ సోకకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో పీఓ ఎంసీహెచ్ డాక్టర్ నీరజ, టీబీ ప్రోగ్రాం అధికారి ఫయాజ్‌ఖాన్, పీహెచ్‌సీ వైద్యుడు ముస్తఫా, హెచ్ఈవో జగదీశ్, ఏఎన్‌ఎంలు, ఆశలు పాల్గొన్నారు.



ఏఎన్‌ఎంలు, ఆశలతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

‘కంటివెలుగు’ శిబిరాలు ప్రారంభం

బెల్లంపల్లి: మున్సిపాలిటీ పరిధిలోని 27వార్డులో సోమవారం కంటి వెలుగు శిబిరాన్ని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంటి సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు కంటివెలుగు కార్యక్రమం ప్రారంభించారని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, కౌన్సిలర్లు పద్మ, కృష్ణ, బీఆర్ఎస్ పట్టణవర్కింగ్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, బీఆర్ఎస్వీ పట్టణ అధ్యక్షుడు శ్రావణ్, నాయకులు, కార్యకర్తలు, బస్తీ ప్రజలు పాల్గొన్నారు.

భీమారం: సీఎం కేసీఆర్ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటివెలుగును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ బుక్యా తిరుమల కోరారు. మండలంలోని బూర్గుపల్లిలో వైద్య ఆరోగ్య శాఖ ద్వారా ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని సోమవారం మండల వైద్యాధికారి శ్వేతతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ వడ్లకొండ రమాదేవి, చెన్నూరు మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ రాజ్‌కుమార్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



బెల్లంపల్లి: శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియా ఎస్ఆర్‌పీ 1గని కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు సురేందర్‌రెడ్డి తెలిపారు. ఎస్ఆర్‌పీ 1గనిపై సోమవారం ఆయన టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ‘అలయ్–బలయ్’ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గనిపై కార్మికులకు రెస్టు రూం సదుపాయం సరిగ్గాలేదని, రెస్టు రూంలో లైటింగ్, ఫ్యాన్ల సౌకర్యం లేదని కార్మికులు నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. గనిలో ఎస్‌డీఎల్ ఆపరేటర్లు అధిక పనిఒత్తిడితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సమస్యలను ఏరియా జీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని కార్మికులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏరియా చర్చల ప్రతినిధి వెంగల కుమారస్వామి, ఫిట్ సెక్రటరీ ఎంబడి తిరుపతి, తొంగల రమేశ్, మోత రాఘవరెడ్డి, రామిడి మహేందర్‌రెడ్డి, రమేశ్, సతీష్, రాజేశం, మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఆర్‌పీ 1గనిపై సమస్యలు తెలుసుకుంటున్న సురేందర్‌రెడ్డి, నాయకులు

బొగ్గుబాయి వార్తలు

‘ప్రతీ ఉద్యోగికి స్వీయ రక్షణ ముఖ్యం’

నస్పూర్: సింగరేణి సంస్థలో పనిచేస్తున్న ప్రతీ కార్మికుడు, ఉద్యోగికి స్వీయ రక్షణే ముఖ్యం అని బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం జాన్‌ఆనంద్ తెలిపారు. ఎస్ఆర్‌పీ 3, 3ఏ గనిపై సోమవారం నిర్వహించిన సేఫ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ ఆడిట్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఉద్యోగి పని స్థలాల్లో వ్యక్తిగత రక్షణ పరికరాలను ఎల్లప్పుడూ ధరించి ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌పీ గ్రూప్ ఏజెంట్ గోపాల్‌సింగ్, రెస్క్యూ ఇన్‌చార్జి రామ్మోహన్‌రావు, గని డిప్యూటీ జనరల్ మేనేజర్ సంతోష్, సేఫ్టీ ఆఫీసర్ మహేందర్, అధికారులు చంద్రముర్మ్, ప్రేమ్‌కుమార్, ఫిట్ సెక్రటరీ రిక్కల గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంపీఎఫ్ చీటీలు పంపిణీ

మందమర్రిరూరల్: సింగరేణి ఉద్యోగులకు గత 2021–22 ఆర్థిక సంవత్సరానికి సీఎంపీఎఫ్ చీటీలను ఏరియాలోని గనుల, డిపార్ట్‌మెంట్‌ల అధికారులు సోమవారం పంపిణీ చేశారు. ఏరియాలోని కేకే–5గనిపై ఉద్యోగులకు గని మేనేజర్ భూశంకరయ్య పంపిణీ చేశారు. ఉద్యోగులకు అందజేసిన చీటీల్లో ఏమైనా అనుమానం ఉంటే, గని సంక్షేమాధికారులను సంప్రదించాలని సూచించారు.

పనుల ఎజెండాపై సమీక్ష

జైపూర్: మండల వ్యాప్తంగా 20గ్రామ పంచాయతీల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు, ఉపాధిహామీ పనుల నిర్వహణపై కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో ప్రభాకర్‌రావు, ఎంపీడీవో పలు ఎజెండాలను వివరించారు. గ్రామాల్లో ప్రజల ఆధార్‌కార్డు ఆన్‌లైన్లో అనుసంధానం, 100శాతం ట్యాక్సీ వసూళ్లు, ఉపాధిహామీ లేబర్ రిపోర్టు, తెలంగాణ క్రీడా ప్రాంగణాలు, బృహత్‌పల్లె ప్రకృతివనాలు, పారిశుధ్య పనులు, నర్సరీల్లో మొక్కల పెంపకంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. సమావేశంలో ఎంపీవో అనిల్, ఏపీవో బాలయ్య, ఈసీ రాజమౌళి, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.